క్లుప్తంగా

శ్రీరామ నవమి ఉత్సవాలు



తొర్రూరు: పట్టణంలోని సీతారామ మందిరంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభం కాగా అర్చకులు రమేష్‌శర్మ, శివలు విశ్వక్సేన పూజలు, కళశ స్థాపన వంటి కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పసుపు కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ప్రత్యేక బస్సులు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీ డిపో నుంచి శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి 5ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. 6వ తేదీ ఉదయం 5గంటల నుంచి డిపో నుంచి భద్రాచలానికి ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు.

డాక్టరేట్ ప్రదానం



తొర్రూరు రూరల్: ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి ఫిజికల్ సైన్స్‌లో డాక్టరేట్‌ను మండలంలోని కంఠాయాపాలెం గ్రామానికి చెందిన కామగాని కరుణ సీనియర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నారు.

శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరై శ్రీవారిని దర్శించుకుని, స్వామివారి యజ్ఞంలో ఆహుతులు సమర్పించారు.

చదువుపై శ్రద్ధ వహించాలి

కేసముద్రం: ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ వహించాలని, అప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎస్‌టీఎస్‌యూ పోటీ పరీక్షల్లో జాతీయస్థాయిలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను, గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్‌లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి కేసముద్రంవిలేజ్ అమీరుద్దిన్‌బాబా దర్గా వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేందర్‌రావు, ఈఈ భీమ్లా, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి తోపాటు సంబంధిత అధికారులు రోడ్డు వెంట పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, ఏఈఈ ప్రశాంత్ నాయక్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సీమంతాలు

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ మంగలితండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణిలకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడారు.

ప్రారంభమెప్పుడో?

- పూర్తయిన సబ్‌సెంటర్ల నిర్మాణాలు
- పూర్తి కావొస్తున్న మరొకటి
- అద్దె గదుల్లో కొనసాగుతున్న సెంటర్ల నిర్వహణ



బైపాస్ రోడ్డులో ప్రారంభానికి నోచుకోని సబ్‌సెంటర్

డోర్నకల్: డోర్నకల్‌లోని మూడు ప్రాంతాల్లో సబ్ సెంటర్ల(ఆయుష్ మాన్ ఆరోగ్య మందిర్) నిర్వహణ అద్దె భవనాల్లో కొనసాగుతోంది. సుమారు 18నెలల క్రితం చేపట్టిన మూడు సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. శాంతినగర్, బైపాస్ రోడ్డు పక్కన, చర్చి కాంపౌండ్‌లలో ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో చేపట్టిన భవన నిర్మాణ పనులకు 2023 ఆగస్టు 23న అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ప్రారంభించారు. 18నెలలకు పైగా నిర్మాణ పనులు కొనసాగగా ప్రస్తుతం బైపాస్ రోడ్డుతోపాటు శాంతినగర్ భవనాల నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధం కాగా చర్చ కాంపౌండ్ భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని సంబంధిత కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

అద్దె భవనాల్లో..

సబ్ సెంటర్లకు శాశ్వత భవనాలు లేకపోవడంతో చాలా కాలంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సబ్‌సెంటర్లలో వైద్యుడితోపాటు ఏఎన్‌ఎంలు, ఎంసీహెచ్‌పీ, ఆశకార్యకర్తలు విధులు నిర్వహిస్తారు. వైద్య సేవల కోసం వచ్చే వారు, సిబ్బందికి వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులు పూర్తయి సబ్ సెంటర్లను వెంటనే ప్రారంభించి స్థానికులకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం రెడ్యానాయక్ మిల్లుకే పోయేవి

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మరిపెడ రూరల్: తాళ్లఊకల గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్/మరిపెడ: బీఆర్‌ఎస్ పాలనలో రేషన్ బియ్యం గోడౌన్ నుంచి నేరుగా మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మిల్లుకే పోయేవని, కానీ ఇప్పుడ పేదలు కడుపు మాడ్చుకోవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ ఆరోపించారు. మరిపెడ మండలం తాళ్లఊకల్ రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అప్పుల పాలైందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం, డోర్నకల్‌లో రెడ్యానాయక్ కుటుంబాలు మాత్రమే బాగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి, కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు రవినాయక్ పాల్గొన్నారు.

తడిసిన మిర్చిని కొనుగోలు చేయాలి



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో తడిసిన మిర్చిని తక్షణమే కొనుగోలు చేయాలని, మిర్చికి మద్దతు ధర కల్పించాలని బహుజన మేధావి డాక్టర్ వివేక్ డిమాండ్ చేశారు. అకాల వర్ష కారణంగా తడిసిన మిర్చిని కొనుగోలు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట జాతీయ రహదారిపై రైతులతో కలిసి వివేక్ శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ.. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతులను పట్టించుకోని ప్రభుత్వం ఉన్నా ఒక్కటే లేకున్నా ఒక్కటే అన్నారు. రైతులను ఏడిపించిన ప్రభుత్వాలు ఎక్కడ కూడా నిలువలేదని గుర్తు చేశారు. రెండు రోజుల నుంచి మిర్చి కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ రాస్తారోకో వద్దకు వచ్చి మద్దతు ధర కల్పిస్తామని, మిర్చి రైతులకు ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్, విష్ణునాయక్, డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు కేలోత్ సాయికుమార్, భూక్యా శ్రీకాంత్, గుగులోత్ సూర్యప్రకాష్, ఎల్‌ఎస్‌ఓ జిల్లా అధ్యక్షులు శివవర్మనాయక్, నాయకులు జవహర్‌లాల్, మాలోతు రమేశ్, శంకర్, చంద్రశేఖర్, వినయ్, రైతులు విజయబాయి, రవి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల వద్ద మోదీ ఫొటో పెట్టాలి

మరిపెడ రూరల్: ప్రతి ఏడాది రేషన్ బియ్యం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు తెలంగాణ రాష్ట్రానికి సహాయం చేస్తుందని బీజేపీ మండలం మాజీ అధ్యక్షుడు బింగి రమేశ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని గుండెపుడి గ్రామంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని రేషన్ కేంద్రాలలో ధరల వివరాల పట్టికతోపాటు ప్రధాని మోదీ ఫొటోని పెట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

జయంతి సభలను జయప్రదం చేయాలి

నెహ్రూసెంటర్: ఈనెలలో జరగనున్న మహనీయుల జయంతి సభలను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీపిరి యాకయ్య, దుడ్డెల రామ్మూర్తి పిలుపునిచ్చారు. సంఘ సమావేశాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మజ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతులు ఉన్నందున కేవీపీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈసమావేశంలో మచ్చ వెంకన్న, సూర్నపు ముత్తయ్య, పూల నరేష్, జల్లె సతీష్, కందులి రాంబాబు, పాక నాగార్జున, యుగంధర్, రాజు, యాకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలవాలిన మొక్కజొన్న



కొత్తగూడ: నేలవాలిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



కురవి: టార్పాలిన్‌పై నీటిని తొలగిస్తున్న రైతు

కొత్తగూడ: ఈదురు గాలులతో గురువారం రాత్రి కూడిన వర్షం కురిసి మండలంలోని ముస్మి, రామన్నగూడెం, దుర్గారం, గోవిందాపురం, ఎదుళ్లపల్లి గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించి 150 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

కురవి: అకాల వర్షంతో సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం గురువారం రాత్రి తడిసింది. శుక్రవారం ఉదయం రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల వద్దకు వెళ్లి టార్పాలిన్‌లపై నిలిచిపోయిన నీటిని తోడారు.

ఇంటి పిల్లర్లను కూల్చిన దుండగులు

చిన్నగూడూరు: ఇంటి నిర్మాణ పిల్లర్లను జేసీబీతో దుండగులు కూలగొట్టారని మండల కేంద్రానికి చెందిన బాధితుడు నీలం శంకరయ్య బోరున విలపించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... సొంత భూమిలో 10 పిల్లర్లతో ఇంటి నిర్మాణం చేపట్టాడు. గతంలో తన చెల్లెలు కొడుకు ప్రదీప్ చంద్ర అడ్డుకోవడంతో పిల్లర్లతోనే నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. గురువారం రాత్రి ప్రదీప్ చంద్ర అనుచరులు పది మంది రెండు కారుల్లో వచ్చి అక్రమంగా పిల్లర్లను జేసీబీతో ధ్వంసం చేశారు. ధ్వంసం చేయడమే కాకుండా దగ్గరలో మేము నివసిస్తున్న ఇంటికి ఆరుగురు మారణాయుధాలతో వచ్చి తలుపులు కొడుతూ, అసభ్యకరంగా తిడుతూ బయభ్రాంతులకు గురి చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

'ఉపాధి హామీ'ని రద్దు చేసే ప్రయత్నాలు



మాట్లాడుతున్న దేవేందర్

గార్ల: జాతీయ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతీ ఏటా నిధుల కోత విధిస్తూ వస్తుందని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఎన్‌డీ కార్యాలయంలో జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వలసలు నివారించి కూలీలకు పనులు కల్పించేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. కూలీలకు పనుల వద్ద ఎలాంటి కొలతలు లేకుండా రోజు వేతనం రూ.600 చెల్లించాలని, కుటుంబంలో ప్రతి ఒక్కరికి 200రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి.సక్రు, సూత్రపు మనోహర్, గాని మల్లేష్, మాన్యా, బజారయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



నెహ్రూసెంటర్: ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నెహ్రూసెంటర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగులు పట్టాబి లక్ష్మయ్య, గూడెల్లి భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపోలో విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2017 ఏడాదిలో రావాల్సిన ఏరియల్స్, 2022 నుంచి రావాల్సిన లీవ్ ఎన్కాష్మెంట్, సీసీఎస్ బకాయిలు, గ్రాజిటీ వెంటనే చెల్లించాలన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు తెల్లరేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ముత్తయ్య, మాచర్ల సుధాకర్, రంజాన్, హరికుమార్, బీఎస్.రావు, ఉమామహేశ్వర్, వీరాచారి, రాజమల్లు, పుల్లారెడ్డి, కోటయ్య పాల్గొన్నారు.

తొర్రూరు: ఆర్టీసీలో సుదీర్ఘ కాలం పని చేసిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీఆర్ చంద్రయ్య కోరారు. శుక్రవారం డీఎం పద్మావతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకన్న, కోశాధికారి జి.స్వామి, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



మరిపెడ రూరల్: పాదయాత్ర చేస్తున్న నాయకులు

మరిపెడ రూరల్: అందరి భవిష్యత్ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌తో రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లఊకల్, పాంబండతండా, వెంకంపాడు, రూప్‌సింగ్‌తండా, చింతలగడ్డతండా, బాహోజిగూడెం, చిల్లంచర్ల, రాంపురం గ్రామాల్లో యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకుడు యుగేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ ఐలమల్లు, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు రవినాయక్, పట్టాభి పాల్గొన్నారు.

కురవి: రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని తట్టుపల్లి, చంద్యాతండా తదితర గ్రామాలలో శుక్రవారం పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్, ఆలయ చైర్మన్ కొర్పు రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కలెక్టరేట్‌ను సందర్శించిన విద్యార్థులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని హోలి వర్డ్స్ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అనుదీప్ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్షేత్ర పర్యటనలో భాగంగా కలెక్టరేట్ చూపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరన్న, హైమావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు ఈనెల 25న ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గుండ్ల రాకేష్, జిల్లా నాయకులు మహేష్, వినోద్, ప్రమోద్, ప్రకాష్, పంకాజ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గార్ల: గార్లకు చెందిన మాజీ విలేకరి యాకూబ్ మియా మృతిచెందడంతో, మృతుడి భార్యకు గార్లలోని అఖిలపక్షం నాయకులు రూ.57,500 నగదును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, కందునూరి శ్రీనివాసరావు, దనియాకుల రామారావు, జంపాల వెంకన్న, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్, ఎంపీటీసీ దంపతులు విస్సంపెల్లి కవిత, బాలకృష్ణలు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శైలజ పాల్గొన్నారు .

క్షీరాభిషేకం

మహబూబాబాద్ అర్బన్: డీఎస్సీ 2008లో నోటిఫికేషన్ ప్రకారం ఎంపికై నష్టపోయిన అభ్యర్థులు మళ్లీ పునరుద్ధరించడానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి డీఎస్సీ ఉపాధ్యాయులు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పాలభిషేకం నిర్వహించారు. అనంతరం విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డికి బొకేను అందజేశారు. కార్యక్రమంలో మేరుగు భాస్కర్, రాజేందర్, నరేష్, శ్రీలత, స్వప్న, రాజరత్నం పాల్గొన్నారు.

డ్రగ్స్‌కి బానిస కావద్దు

కేసముద్రం: డ్రగ్స్‌కి యువత బానిస కావద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లెంకల సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు మైసయ్య, రాజు, యాదగిరి, మున్ని పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులు

దంతాలపల్లి: ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ గురుకులాలకు ప్రవేశ పెట్టిన గురుకుల ప్రవేశ పరీక్షల్లో పెద్దముప్పారం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు సీట్లు సాధించినట్లు హెచ్‌ఎం కిషన్ నాయక్ శుక్రవారం తెలిపాడు. గొడిశాల మానస, బండి శివాని, మల్లెల నవజీద్, ధార్మారపు తరుణ్ సీట్లు సాధించారన్నారు. ఎంఈఓ శ్రీదేవి అభినందించారు.

ప్రజాధర్నాను జయప్రదం చేయండి

గార్ల: ఆపరేషన్ కగార్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈనెల 8న హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ప్రజాధర్నాను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు జి.సక్రు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సత్యనారాయణపురం, చిన్నకిష్టాపురం గ్రామాల్లో ప్రజాధర్నా వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

మహాసభను విజయవంతం చేయాలి

పెద్దవంగర: ఈనెల 27న హనుమకొండలోని ఎలకతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహసభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ సర్పంచ్ రామచంద్రయ్య శర్మ, సంజయ్, వెంకన్న, హేమాని, రాజేందర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

డోర్నకల్: సీరోలు మండలం అందనాలపాడు శివారు సీత్లాతండాలో బుడియా బాపు ఆలయ పూజారి అంగోతు చంద్రుసాధు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ హాజరై పూజలు చేశారు.

కాలినడకన భద్రాచలానికి..



బయ్యారం: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండకు చెందిన ఐలి రాము, నాగనబోయిన జశ్వంత్, యరసాని నాగరాజు శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనేందుకు కాలినడకన భద్రాచలానికి శుక్రవారం బయలుదేరారు.

మాలల అభివృద్ధికి ప్రభుత్వాలు పాటుపడాలి

తొర్రూరు: మాలలు, దళితుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల మహేష్ అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జన్మదినం సందర్భంగా మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఆదర్శప్రాయుడు శ్రీరాముడు

మహబూబాబాద్ రూరల్: ఆదర్శ ప్రాయుడు శ్రీరాముడు అని ప్రముఖ ప్రవచకులు గార్లపాటి ప్రభాకర శర్మ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో జరుగుతున్న 67వ శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా రామాయణ బాలకాండ, విశ్వామిత్ర యాగ రక్షణపై ప్రముఖ ప్రవచకులు గార్లపాటి ప్రభాకర శర్మ శుక్రవారం రాత్రి వివరించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

డోర్నకల్: రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం సీరోలు మండలం మోదుగ్గడ్డతండాకు చెందిన దారావత్ పార్వతి(28) ఈనెల 2న భర్త అనీల్‌కుమార్‌తోపాటు కుటుంబ సభ్యులు లేని సమయంలో ఇంట్లో మిరపకాయ ఏరుతుండగా ఎదురింటికి చెందిన దారావత్ చంటి ఇంట్లో ప్రవేశించి పార్వతి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నం చేశాడు. చంటి నుంచి విడిపించుకుని సమీపంలో ఉన్న బావ వరసయ్యే దారావత్ రమేశ్‌ను పిలవడంతో రమేష్ వచ్చి చంటిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దారావత్ రవి అనే వ్యక్తి చంటిని పట్టుకునే ప్రయత్నం చేయగా చంటి పారిపోయాడు. కొంతసేపటి తరువాత అవమానభారంతో పార్వతి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు పార్వతిని ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతదేహానికి ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి భర్త అనిల్‌కుమార్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. మృతుడి పేరు పసుపులేటి కమలాకర్ స్వస్థలం ఖమ్మం జిల్లా కేంద్రంలోని కాల్వ ఒడ్డుగా ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నారన్నారు. కొంతకాలం నుంచి జిల్లా కేంద్రంలోని వేల్పుల సత్యం నగర్ కాలనీలో ఒక్కడే నివాసం ఉంటున్నట్లు తెలిసిందన్నారు. కమలాకర్ అనారోగ్యానికి గురికాగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్ట్ మార్టం గదిలో భద్రపరిచామని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. వివరాలకు టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ సెల్ నంబరు 87126 56931 కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

లక్ష్మీపురంలో బాలిక..

నెల్లికుదురు: చికిత్స పొందుతూ ఓ బాలిక మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాలిక కరోన వచ్చినప్పటి నుంచి ఆనారోగ్యంతో బాధ పడుతున్నట్లు తెలిపారు. అనారోగ్య బాధలు భరించలేక మనస్థాపంతో మార్చి 30న కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకుని తాగినట్లు తెలిపారు. వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘన.. పలువురికి జరిమానా

తొర్రూరు: గుడుంబా తయారీ, రవాణా కేసులో పట్టుబడి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి ఎక్సైజ్ అధికారులు జరిమానా విధించారు. శుక్రవారం ఎక్సైజ్ ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ రాజేశుని ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అమ్మాపురానికి చెందిన గుంటుక యాకయ్య, నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి వాసి పెరుమాండ్ల సత్తెమ్మ, పెద్దవంగర మండలం ఎల్‌బీ తండాకు చెందిన జాటోతు రాజులు సారా తయారీ, రవాణా కేసులో గతంలో పట్టుబడ్డారు. అధికారులు వారిని ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. కాగా నిందితులు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి అదే తరహాలో గుడుంబా విక్రయాలు జరిపారు. ఎక్సైజ్ అధికారులు వారిపై బ్రీచ్ కేసులు నమోదు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. వారి నుంచి రూ.1.35లక్షల జరిమానా వసూలు చేశారు. గుడుంబా తయారీ, విక్రయాలు జరిపితే రిమాండ్‌కు పంపుతామని, పీడీ యాక్టులు నమోదు చేస్తామని ఏఈఎస్ ప్రవీణ్ తెలిపారు.

ఆలయాన్ని పునరుద్ధరించాలి

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న శివాలయాన్ని పునరుద్ధరించాలని సమాజ సేవకుడు వరిపెల్లి అనిల్ ప్రభుత్వాన్ని కోరాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ శతాబ్దం కాకతీయుల నాటి చారిత్రక ప్రాముఖ్యత కల్గిన శివాలయం ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుందన్నారు. శివాలయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, పురావస్తు శాఖ ఇప్పటి వరకు తొంగిచూడలేదన్నారు. గ్రామస్తులు పూనుకుని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి కాకతీయులనాటి శివాలయాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ప్రజలపై ఆర్థికభారం తగ్గించడమే ధ్యేయం



మహబూబాబాద్: బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులోని హన్మంతుని గడ్డలో శుక్రవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆర్థికభారం తగ్గించి జీనవ ప్రమాణాలు మెరుగు పర్చాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.